# ౬ తొత్తుముండ చావు

ఏడెనమండుగురు తొత్తులు మాఘబహుళ చతుర్దశినాటియుదయం వీధంటే గుంపుగా పోతూవున్నారు. వాళ్ళవేషాలు అతివికారంగాను అతివిచారంతో కూడుకున్నవిగాను ఔపించినయి. అయినా కళ్ళల్లో ఆ వారి కలవడిన హడావిడి ఆలాగే వున్నట్టుంది. ఆవాళ్ళ కళ్ళన్నీ యిటూ అటూ ఊ తిరిగిపోతున్నాయి. ఆ ఆదుర్దాలోనే "రత్తీ! రత్తీ!" అని మఱోతొత్తు ఇంటితలుపు తట్టి "ఇంకా తొంగోని లెగలేదిది. రాత్రి ఎవడు తారసిల్లోడో?" అని అనుకొంటూ పోతున్నారు. వాళ్ళవెనకనే రత్తి తలుపుదీసి "ఏమ్రరో! ఎందుకు?" అంది. "రాయేరాయే! మన కాంతం తెల్లాఱగట్ల చచ్చిపోయిందట. మోసుకెళ్ళే దిక్కున్నా లేదట. ఎల్లావున్నశఫం అలావుందట." అన్నారువాళ్ళు. రత్తి అదో విధగా మాఱిపోయింది ఆమాట వినడంతోనే—

రత్తింకా లోపలకు వెళ్ళకుండా ఆ రత్తింట్లోంచి దాని విటుడు వీరన్న యీతలకువస్తూ' నీవు లెగిసేముందు నన్ను లెగ్గొడితేం' అన్నాడు. "ఇప్పుడేగా లెగిసింది నేను? ఇప్పుడేగా ఇడిసిపెట్టేవు నా చెంగు? ఇంత లోనే మఱపంత్రటా?" అంది రత్తి. అని "వీరన్నబావా, ఆళ్ళవీధిని మా కాంతం సచ్చిపోయిందట. దానిశఫాన్ని మోసేవాళ్ళన్నా లేరంట.

మావోళ్ళంతా ఆడోళ్ళు పరుగెత్తారు. నాగతీఅంతే సేస్తావా ? నివ్వేమన్నా సూస్తావా నేసస్తేను ?'' అంది. వీరన్న ముసిముసినవ్వు నవ్వుతూ కండువా ముసుగేసుకొని "నచ్చినప్పుడు మాటగందా. నీవు సావవు. నీకేంబయంలేదులే,'' అంటూ తపిడార్నె పోయినాడు. రత్తి గబగబా తనకోక ఆకోక వదిలేసి మఱోకోక పాతది కట్టుకొని, జుట్టు దులుపుకు మళ్ళీ జాఱుముడిగా వేసుకొని వీధంట—"మాకాంతం ఎంతలోపోయింది జబ్బన్నా చేసిందన్న సంగతి తెలీదు మాకెవ్వరికీ'' అంటూ అనుకుంటూ వెళ్ళింది.

ఆడవాళ్ళు తొత్తులుగా అవడం సంసారస్త్రీలుగాని సంసారప్పురుషులుగాని హర్షించరు. కాని వాళ్ళని చూచినప్పుడు మాత్రం గుర్తించక మానరు. ఏమనా! "అదెట్టా పెట్టుకుందో మల్లెమొగ్గలు ! అదెల్లా తొడుక్కొందో నీలీనీలిరైకి ! అదెల్లా నడుస్తూందో గజ్జెలగుఱ్ఱంలా'' అని- కాని అదేవేషం భేషజం తీసేసుకొని చినిగిన చీరతో ఏకూర తెచ్చుకోడానికో పోతూవుంటే ఎవరూ చూడరు, ఒక్కఎటిగుండి కనిపెట్టుకొని వేచి కాచియున్న కువిటులు తక్క—ఆలా ఎఱుక పడకుండా పోతూవుంది ఆఉదయం రత్తి. కూరక్కాదు—ఎందుకైతేం ? —కాంతం సొర్గస్తురాలైనందుకే-తెలిసికోవాలిసిందల్లా ఎఱుక పడకుండా పోతూవుందా లేదా అని.

కాంతం— గుమ్మంముందు —పాపం—చిరకాలం పడుపువృత్తి నడపినడపి ఎంతమంది ప్రాయంలోవాళ్ళని పాడుచేసిందో, ఎంతమంది ప్రాభవం తానుతీసుకొందో? ఎంతైతేం ? తుదకుచనిపోయింది. దాని శవం దానిగుమ్మంముందుకటుకెక్కించేరు; దానిగుమ్మంఅంటే ఒకతడికెలగది తడికెలగుమ్మం. అద్దెయిల్లు-కాని అప్పచెల్లెళ్ళల్లే పదిపదిహేనుమంది

తోటితొత్తులు గుమిగా మూగినారు. దానిశవంకేసి చూస్తూ జాలిపడ్డారు. "ఎత్తండర్రా ! రేపు మనబతుకులూ అంతేనర్రా ! ఎత్తండర్రా !" అంటూ నలుగురూ వాళ్ళల్లోవాళ్ళే సోమీ కామీ మంగి మూర్తీ ఎత్తుకున్నారు. ముందు అగ్నిహోత్రం తాను పట్టుకుంటానంటూ, అప్పుడేవచ్చిన రత్తి, హడావిడిపడితే, "దానికెంత ముచ్చటగా వుందో యీయండర్రా !" అంటూ ఇచ్చారు—

అప్పటికి ఉదయం తొమ్మిదైంది. బాగా ఎండ చెట్లమీద్ది అరుగుల మీదకూ్కడా దిగింది. వీథంటే మోసుకుపోతున్నారు శవాన్ని—

రత్తి మోసేవాళ్ళతో ఓసంగతి చెప్పింది. "ఈ కాంతం శవాన్ని దాన్నుంచుకొన్నవాళ్ళ యిళ్ళకాడ ప్రతీయింటికాడా దించుండి" అని. "వాళ్ళ మొహాలీడ్చ ఓ మొగాడూ కనబడ్డు ఇప్పుడు. కృతఘ్నులు. నా వీరన్నబావైతే యిల్లా చేస్తాడా !" అంది.

వెనకాతల 5, 6గురు తొత్తులు నడుస్తున్నారు.

"ఎవరికైనాగాని భూమ్మీద ఉండేదేచావు. కాని ఎవరూ ఏడ్వని చావు దీన్దే ధన్యమైంది, మామయ్యా !" అన్నాడు వీరన్న ఆ వీథినే తన యింటి అరుగుమీద కూర్చుని తన మేనమామతో — దూరాన్ని కాంతం శవాన్ని చూచి—మటి సరిగ్గా శవం వీరన్న గుమ్మంముందుకు వచ్చింది. అక్కడే ముందుగా ఆపి "వీరన్నా ! రావయ్యా ! చూస్తావు ఏమిటి ?" అన్నారు వెనకాలున్న తొత్తుముండలు.

రత్తికాపిలుపుతో ముఖం కందగడ్డైపోయింది. "ఇక్కడాపారేం?" టంది. తన చేతిలోని కుండనిప్పు ఏలా రగుల్తోందో ఆలా రగుల్తోంది

దానిగుండె కొలిమి. "ఓసి దీంతస్సాగొయ్యా! నా వీరన్న బావని కూడా ఇది — కాంతం — తనవల్లో వేసికొంది!" అని అనుకొంది. చేతిలో నిప్పుకుండ జారేసింది. అది వీరన్న యింటిగుమ్మంముందు పగిలిపోయి నిప్పుకణాలన్నీ రాజమార్గాన్నే చెల్లాచెదురయినయి.

మొట్టమొదట వీరన్నకు గుడ్లు చింతనిప్పులైపోయినాయి. కాని కార్యం లేదనుకోని, అరుగుమీదున్న తన మేనమామ ఏమనుకుంటాడో అని, ఊరకే సన్నగా "ఏం పనే అది రత్తీ!" అన్నాడు. "నీ యింటి గుమ్మం అయిపోయింది. నా యింటి గుమ్మంముందైతే యీ కుండెడు నిప్పులు నీ మొహాన్ని పోసియుండేదాన్ని" అంది రత్తి. వీరన్న అన్నాడు "శాంతించు! ఇది పగలు, రాత్రిపూటకాదు" అని — .

రత్తికి గుడ్లంట నీరుతిరిగి శఫంకేసి చూచిచూచి "కాంతం! కాంతం! నీవు చచ్చి స్వర్గాన్నున్నావు. ధన్యురాలివి. నాకో పాఠం నేర్పేవు. నేనీరోజునుంచి పడుపువృత్తి ఒదలేసి సన్యాసినిగా మారిపోతున్నా! నా యీరన్నబావ నావాడే అనుకొన్నా! నీవాడే! నీవాడే!" అని శపథం పూనింది — సాగేరు, మఱో నిప్పుకుండతో.

ఏం చేస్తాడు? వీరన్న వీథిలో నిప్పులెత్తుకు గుమ్మంముందు శుభ్రం చేసికొన్నాడు.

| రచన | స్ఫురణ | తొలిప్రకటనము |
|---|---|---|
| 31—3—1931 | నరసాపురం | "వినోదిని"లో |